క్లుప్తంగా

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

అలంపూర్: ఈ నెల 5న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పద్మావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలంపూర్ పట్టణంలోని మహిళా సమాఖ్య భవనం ఆవరణలో ఉదయం 10 గంటలకు ప్రజావేదిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలంపూర్ మండలంలో 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

గద్వాల క్రైం: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గద్వాల పట్టణంలోని బీరోలు–రెండో రైల్వే గేట్ సమీపంలో మంగళవారం సాయంత్రం ఏపీ 22 వీ 8774 గల టిప్పర్‌లో ఇసుక తరలిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు రైల్వేగేట్ సమీపంలో ఇసుక టిప్పర్‌ను పట్టుకున్నారు. ఇసుక తరలింపునకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



అలంపూర్: ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూలులోని ఎమ్మెల్సీ నివాసంలో నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన 80 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారికి మెరుగైన వైద్యం కోసం సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూత అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సర్దార్‌బాష, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పూర్తయిన పైపులైన్ మళ్లింపు పనులు

అయిజ: భారతమాల రోడ్డు నిర్మాణంలో భాగంగా మండలంలోని బింగుదొడ్డి గ్రామ సమీపంలో రోడ్డుకు అడ్డుగా ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను దారి మళ్లింపు పనులను మంగళవారం సిబ్బంది పూర్తి చేశారు. పైప్‌లైన్ పక్కదారి మళ్లించేందుకు జిల్లాలోని అయిజ, వడ్డేపల్లి, రాజోళి, మానవపాడు, అలంపూర్ మండలాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేశారు. బుధవారం నుంచి తాగునీటి సరఫరా సాఫీగా జరుగుతుందని మిషన్ భగీరథ అధికారులు పేర్కొన్నారు.

నేడు ఇర్కిచేడులో రెవెన్యూ సదస్సు

కేటీదొడ్డి: మండలంలోని ఇర్కిచేడు గ్రామంలో బుధవారం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హరికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల నుంచి భూ సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగించుకోవాలని కోరారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి

ధరూరు: మండలంలో ఏరువాక పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రానికి చెందిన రైతులు ఎద్దులను రంగులతో అలంకరించి పురవీధుల గుండా ఊరేగించారు. అదే విధంగా తమ పొలాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి సాగు పనులు ప్రారంభించారు.

చిటుకవ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి



ఎర్రవల్లి: గొర్రెలు, మేకల్లో వచ్చే చిటుకవ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్య అధికారి డాక్టర్ భువనేశ్వరి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొండపేట గ్రామంలో టీకా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా 1670 గొర్రెలు, 192 మేకలకు వైద్య సిబ్బందితో కలిసి టీకాలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలంలో వచ్చే చిటుకవ్యాధి ప్రమాదకరమైందన్నారు. క్లాస్ట్రీజియం పెర్ఫ్రింజెస్ అనే బ్యాక్టీరియా వల్ల వ్యాధి సోకుతుందన్నారు. వ్యాధి సోకిన జీవాలు ఎలాంటి లక్షణాలు కన్పించకుండా చిటికెలో చనిపోతాయి కనుక ఈ వ్యాధికి చిటుకవ్యాధి అనే పేరు వచ్చిందన్నారు. ఈ నెల 1 నుంచి 27 వరకు గ్రామాల వారీగా టీకాల కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వినయ్‌కుమార్, దేవన్న పాల్గొన్నారు.

‘సాగు’దామా.. ఆగుదామా!

- ముందస్తు వానలతో గందరగోళం
- పలుచోట్ల విత్తనం వేసిన రైతులు
- తొందర పడొద్దంటున్న అధికారులు

ఉండవెల్లి: ముందస్తు వానలు కురుస్తుండటంతో మండలంలోని రైతులు అయోమయానికి గురవుతున్నారు. పంట సాగు చేద్దామా.. పూర్తిగా వానాకాలం వచ్చే వరకు ఆగుదామా అన్న సందిగ్ధంలో ఉన్నారు రైతన్నలు. సాధారణంగా వానాకాలం మొదలైన తర్వాత జూన్ మొదటి వారం తర్వాత రైతులు విత్తనాలు వేస్తారు. అయితే ఈసారి వానకాలం రాకముందే వర్షాలు కురుస్తుండటం, తొలకరి వానలని అల్పపీడన ప్రభావంతో పడుతున్నాయని పలువురు అంటుండగా అన్నదాతలు గందరగోళంలో ఉన్నారు. ఉండవెల్లి, బైరాపురం, బొంకూరు, గ్రామాల్లో పలువురు రైతులు దుక్కులు దున్ని సిద్ధం చేయగా, మరికొందరు విత్తు వేశారు. ఇప్పటికే పత్తి విత్తనాలు అధిక మోతాదులో నాటించారు. తొలకరి వానలు ఎత్తిపోతున్నాయని, చదును పనులు చేద్దామంటే వానల కారణంగా దుక్కులు సిద్ధం చేయలేని పరిస్థితి ఉందని రైతులు



ఉండవెల్లిలో విత్తనాలు వేసి ఉంచిన పొలం



బొంకూరులో పత్తి విత్తనాలు విత్తుతున్న రైతులు

ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నేలపూర్తిగా తడిసిన తర్వాతే సాగు ప్రారంభించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

అనుకూలమా.. ప్రతికూలమా ?

సాధారణంగా రోహిణికార్తెలో రోళ్లు పగిలే ఎండలు ఉంటాయని సామెత ఉంది. కానీ ఇంతకు ముందెన్నడు చూడని భిన్నమైన వాతావరణం ఈసారి ఎదురవడంతో భవిష్యత్ ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురిసినా తీరా పంట చేతికందే సమయంలో వరణుడు ముఖం చాటేస్తే తమ పరిస్థితి ఎలా ఉంటుందోనని కలవరపాటుకు గురవుతున్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రస్తుతం దుక్కులు సిద్ధం చేసుకోవడం, చేలలో గత పంటల వ్యర్థాలు తొలగించే పనిలో బిజీగా ఉన్నారు.

పత్తి విత్తనాలు వేశాం

ఇటీవల వరుసగా వర్షాలు పడటంతో రెండు ఎకరాల్లో పత్తి సాగుకు సిద్ధం చేశాం. పత్తి విత్తనాలు కూడా విత్తాం. ప్రస్తుతం వర్షాలు పడకపోవడంతో పొలం కాస్తా పొడిబారింది. జాగ్రత్తలు పాటించేందుకు అధికారులు రైతులకు అవగాహన కల్పించాలి.

– శేషన్‌గౌడ్, కంచుపాడు, రైతు

రైతులు తొందరపడొద్దు

గతంలో ఎన్నడు లేని విధంగా నైరుతి రుతుపవనాలు ముందే వచ్చాయి. 60 నుంచి 80 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైన తర్వాత అదునులోనే విత్తనాలు వేసుకోవాలి. తొందరపడి విత్తనాలు వేస్తే చీడపీడల బారిన పడే ఆస్కారం ఉంది.

– అనిత, ఏఓ, ఉండవెల్లి

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు

అయిజ: మున్సిపాలిటీలో పారిశుద్ధ్యంపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు ఆదేశించారు. మంగళవారం మున్సిపాలిటీలోని 11వ వార్డులను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. 11వ కమతంపేట కాలనీలో శిథిలమైన డ్రెయినేజీలో మురుగు ఎక్కువగా ఉందని దానిని తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. యంత్రాల సహాయంతో మురుగును తొలగింపు పనులు దగ్గరుండి చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. రాష్ట్రంలోని మున్సిపల్ ప్రాంతాలను నివాసయోగ్యమైన, పర్యావరణ అనుకూల నగరాలుగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక తయారు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతిరోజు ‘ఒక చర్య.. ఒక మార్పు’ నినాదంతో సిబ్బంది పనిచేయాల్సి ఉంటుందన్నారు. ప్రజల భాగస్వామ్యాన్ని సమ్మిళితం చేసి నూతన మౌలిక సదుపాయాలు, కొత్త ఆవిష్కరణలు చేసి సుస్థిరమైన పట్టణ అభివృద్ధి సాధించడమే వంద రోజుల ప్రణాళిక ముఖ్య లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలను విస్మరించారు



మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

గట్టు: రాజకీయ అండదండలు ఉన్న వారికే ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో చోటు కల్పించారని, అర్హులైన పేదలను విస్మరించారని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు కాలనీలు సందర్శించారు. ప్రజా పాలనలో సంక్షేమ పథకాలు పేదల కోసమే అని చెప్పడం తప్పా, ఆచరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ చెబుతున్న దొకటి, చేస్తున్నది మరొకటని మండిపడ్డారు. కలెక్టర్ గట్టు గ్రామంలో స్వయంగా పర్యటిస్తే, దాదాపుగా 30 మంది దాకా పూరి గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలు కన్పిస్తాయన్నారు. నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రతి మండలంలో పర్యటించి, ఇందిరమ్మ ఇళ్లకు అర్హులను గుర్తించి, వారికి ఇళ్లు అందించే విధంగా కలెక్టర్ దృష్టికి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, మండల అధ్యక్షుడు బలరాం, వెంకట్రాములు, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య



అలంపూర్‌లో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతర ర్యాలీ

అలంపూర్/రాజోళి/ఇటిక్యాల: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందని, ప్రభుత్వ బడులను కాపాడుకుందామని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ అన్నారు. అలంపూర్ పట్టణంలో యూటీఎఫ్ అధ్వర్యంలో సర్కారు బడుల్లోనే పిల్లలను చేర్పిద్దామనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరారు. ప్రభుత్వ బడుల్లో కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎన్‌రోల్మెంట్ ప్రచార జాత నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విలువలతో విద్యను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మెరుగైన విద్య పేరుతో ప్రైవేటు పాఠశాలలకు కడుతున్న డబ్బులను పేదలు ఆదా చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అలంపూర్, ఉండవెల్లి మండలంలోని బస్వాపురం, వడ్డేపల్లి మండలంలోని శాంతినగర్‌లలో యూటీఎఫ్ ఇంటింటి ప్రచారంతో పాటు ర్యాలీలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్ యూటీఎఫ్ నాయకులు కుమార్‌నాయుడు, బీసన్న, తిలక్, మద్దిలేటి, మాబుసాబ్, రాముడు, వెంకట్రాముడు, సువిజ్ఞానం, చిన్నమద్దిలేటి, ముస్తాక్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

❁ ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య లభిస్తుందని టీఎస్ యూటీఎఫ్ సభ్యులు అన్నారు. మండల కేంద్రం రాజోళిలో ప్రభుత్వ బడిలో విద్యార్థుల నమోదు కోసం ప్రచారజాత, ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య అందుతుందన్నారు.

❁ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఉదయ్‌కిరణ్ అన్నారు. ఇటిక్యాల మండల పరిధిలోని మునుగాల గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటా తిరిగి కరపత్రాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కార్యదర్శి గంగాధర్, కొప్పుల లక్ష్మీనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాజోళిలో ర్యాలీ నిర్వహిస్తున్న టీఎస్ యూటీఎఫ్ సభ్యులు

రైతులకు నాణ్యమైన విత్తనాల పంపిణీ

సాక్షి నెట్‌వర్క్: రైతులు ప్రతి పంటలో నాణ్యమైన విత్తనాలను వాడినప్పుడే 15 శాతం మేర వరకు అధిక దిగుబడి సాధించవచ్చని పాలెం ప్రాంతీయ జొన్న పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ మహేశ్వరి అన్నారు. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ ఏడాది నాణ్యమైన విత్తనం– రైతన్నకు నేస్తం అనే వినూత్న కార్యక్రమ చేపటినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లోని రైతువేదికల్లో ఆర్‌ఎన్‌ఆర్ 15048 వరి రకం, జొన్న (పీవైపీఎస్) విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం పంటల సాగు విధానంపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

✻ గట్టు మండల పరిధిలోని గొర్లఖాన్‌దొడ్డి రైతు వేదికలో పథకం ద్వారా ఎంపిక చేసిన రైతులకు వ్యవసాయ పరిశోధనా కేంద్రం ద్వారా ఉత్పత్తి చేసిన నాణ్యమైన విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మహేశ్వరి మాట్లాడుతూ.. ప్రభుత్వం, వ్యవసాయ శాఖ విత్తన సాంకేతికను గ్రామస్థాయికి తీసుకెళ్లి, వచ్చే మూడేళ్లలో గ్రామాలు విత్తన సంవృద్ధిని సాధించే దిశగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

✻ సరైన యాజమాన్య పద్ధతులతో పండించిన విత్తనాలను తరువాతి పంటలకు సీడ్‌గా ఉపయోగించుకొని నకిలీ విత్తనాల బారిన పడకుండా ఉండాలని పాలెం కృషి వి/జ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త శంకర్ అన్నారు. ఎర్రవల్లి మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి రైతువేదికలో ఏఓ రవికుమార్ ఆధ్వర్యంలో 49 మంది రైతులకు వరి, జొన్న విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు నరేష్, ప్రవల్లిక, జెన్నిఫర్, వేదవతి, సంధ్యారాణి, సురేందర్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

✻ అయిజ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మండల వ్యవసాయ అధికారి జనార్దన్‌తో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ మహేశ్వరి రైతులకు వరి, పచ్చజొన్న విత్తనాలు అందజేశారు.

✻ అలంపూర్ మండల పరిధిలోని బుక్కాంపురంలో మండల వ్యవసాయ అధికారి నాగార్జున్‌రెడ్డి నాణ్యమైన విత్తనం– రైతులకు నేస్తం కార్యక్రమంలో భాగంగా రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు.

✻ ఉండవెల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో 8 వరి విత్తనాల మినీకిట్స్‌ను రైతులకు పాలెం వ్యవసాయం శాస్త్రవేత శంకర్, మండల వ్యవసాయశాఖ అధికారి అనిత అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓలు రాజేష్, హసీనా పాల్గొన్నారు.

✻ వడ్డేపల్లి మండల పరిధిలోని కొంకలలో రైతులకు ఫౌండేషన్ వరి విత్తనాలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి సక్రియానాయక్ అందజేశారు. కార్యక్రమంలో పాలెం శాస్త్రవేత్త సిద్దయ్య, వ్యవసాయ విస్తరణ అధికారులు విమల, రవీందర్‌రెడ్డి, వినోద్ కుమార్, చంద్రకళ, రామనాయుడు పాల్గొన్నారు.



బుక్కాపురంలో రైతులకు విత్తనాలు అందజేస్తున్న వ్యవసాయ శాఖ అధికారి



ధరూరులో బ్రోచర్లను విడుదల చేస్తున్న పాలెం శాస్త్రవేత్త మాధురి

✻ రైతులు సేంద్రియ ఎరువుల వాడకం ద్వారానే భూమి సారవంతంగా మారుతుందిన వ్యవసాయ శాస్త్రవేత్త కళ్యాణి, ఏఓ రాజశేఖర్ అన్నారు. మల్దకల్ రైతు వేదికలో వ్యవసాయ, జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో సమావేశం నిర్వహించారు.

✻ రైతులు సాగుకు సంబంధించిన విషయంలో విత్తన ఎంపిక ప్రధాన అంశమని పాలెం వ్యవసాయ శాస్త్రవేత్త మాధురి అన్నారు. ధరూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శ్రీలత, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

✻ విత్తన స్వయం సమృద్ధే లక్ష్యంగా రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ హనుమంతు అన్నారు. కేటీదొడ్డి మండలంలోని మైలగడ్డ రైతువేదికలో మండల వ్యవసాయ అధికారి సాజిద్ రెహమాన్ ఆధ్వర్యంలో రైతులకు వరి, జొన్న విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త మాధురి, ప్రీతిసుధ, ప్రియాంక, కిరణ్‌కుమార్, మమత, భరత్‌సింహ, లావణ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

సాక్షి నెట్‌వర్క్: భూ సమస్యల పరిష్కారానికే గ్రామ గ్రామానా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూ రికార్డుల సవరణ, విస్తీర్ణ మార్పులు, వారసత్వ సమస్యలు, భూమి స్వభావానికి సంబంధించిన లోపాలు, నిషేధిత జాబితాలో ఉన్న భూముల సాదాబైనామాలు, సర్వే నంబర్ గల్లంతు, పట్టాదారు పాసు పుస్తకాలు జారీ కాకపోవడం వంటి సమస్యలు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

☆ అలంపూర్ మండలం ర్యాలంపాడులో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ మంజుల 37 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్ఐలు దుర్గాసింగ్, మాసుం బాష, తదితరులు పాల్గొన్నారు.

☆ కేటీదొడ్డి మండలం గువ్వలదిన్నె రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ హరికృష్ణ 20 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ శివశంకర్, ఆర్ఐ అశోక్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

☆ గట్టు మండలంలోని మల్లంపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 19 మంది రైతులు నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ మదన్ మోహన్‌గౌడ్ తెలిపారు. ఆరగిద్ద గ్రామంలో రెవెన్యూ సదస్సులో 71 మంది రైతులు భూ సమస్యలపై దరఖాస్తు చేసుకున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు.

☆ అయిజ మండలంలోని ఉప్పల గ్రామంలో తహసీల్దార్ జ్యోతి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

☆ ఉండవెల్లి మండలం మెన్నిపాడు గ్రామంలో తహసీల్దార్ ప్రభాకర్ ఆధ్వర్యంలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. చిన్నఆముదాలపాడులో డిప్యూటీ తహసీల్దార్ వెంకట్రమణ ఆధ్వర్యంలో దరఖాస్తులు తీసుకున్నారు. మెన్నిపాడులో 21 దరఖాస్తులు, చిన్న ఆముదాలపాడులో 15 మొత్తం 36 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

☆ రాజోళి మండలం నసనూరు గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 12 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రామ్మోహన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ చంద్రకాంత్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

☆ మానవపాడు మండలంలోని గోకులపాడు గ్రామంలో భూభారతిపై అవగాహన సదస్సు తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కరుణకార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

☆ ధరూరు మండల పరిధిలోని మన్నాపురం, నీలహళ్లి గ్రామాల్లో తహసీల్దార్ నరేందర్, డీటీ అలివేలు మంగమ్మ రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మన్నాపురంలో 125, నీలహళ్లిలో 50 మొత్తం 175 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

☆ వడ్డేపల్లి మండల పరిధిలోని బుడమర్సు నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 17 దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తులు పరిశీలించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు.

☆ ఎర్రవల్లి మండల పరిధిలోని బట్లదిన్నెలో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ నందిని పాల్గొన్నారు. ప్రజల నుంచి 27 అర్జీలను నేరుగా స్వీకరించారు. ఆర్ఐలు శంషీర్, శ్రీనివాస్, ఎస్ఎ నరేష్ పాల్గొన్నారు.

☆ మల్దకల్ మండలం పాల్వాయి, శేషంపల్లి గ్రామాల్లో డిప్యూటీ తహసీల్దార్ ఝాన్సీరాణి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పాల్వాయిలో 100, శేషంపల్లిలో 7 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ పేర్కొన్నారు.



ర్యాలంపాడులో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సు



శేషంపల్లి రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు




బట్లదిన్నెలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ నందిని



మల్లంపల్లిలో రెవెన్యూ సదస్సులో దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ మదన్‌మోహన్ గౌడ్



మెన్నిపాడులో దరఖాస్తు తీసుకుంటున్న తహసీల్దార్ ప్రభాకర్



నసనూరులో రెవెన్యూ సదస్సులో దరఖాస్తు తీసుకుంటున్న అధికారులు



మన్నాపురంలో రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ నరేందర్



ఉప్పలలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న తహసీల్దార్ జ్యోతి